
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
ఆదివారం 24 నవంబరు 2024



జానయ్యకు డాక్టరేట్

మొయినాబాద్ రూరల్, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దమంగళారం గ్రామ పరిధిలోని మమత ఇంటర్నేషనల్ స్కూల్లో హిందీ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కవి, గాయకుడు ఆరెంపుల జానయ్యకు డాక్టరేట్ వరించింది. ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్‌కు చెందిన డాక్టర్లు మాణిక్‌రావు, విల్సన్‌లతో పాటు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గంగాధర్, సిటీ సివిల్ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ డాక్టర్ అంజనీ కుమార్‌లు శనివారం నగరంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

కుక్కలతో జనం బెంబేలు

- వీధుల్లో గుంపులుగా సంచారం
- మహిళలు, చిన్నారులపై దాడులు
- రాత్రివేళ బయటకు వెళ్లలేని పరిస్థితి
- బెడద తొలగించాలని వేడుకోలు



8

‘మహా’విజయంపై సంబురాలు

- చేవెళ్లలో టపాసులు కాల్చిన బీజేపీ శ్రేణులు
- హర్షం వ్యక్తం చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం
- తెలంగాణలోనూ అధికారంలోకి వస్తాం



8

కన్హా శాంతివనంలో గుజరాత్ గవర్నర్

- ట్రీ కన్జర్వేషన్ సెంటర్, టిష్యూ కల్చర్ ల్యాబొరేటరీల పరిశీలన
- 15 నిమిషాల పాటు ధ్యానం
- మొక్క నాటిన ఆచార్య దేవ్ వ్రత్



6

25న దివ్యాంగులకు జిల్లా స్థాయి క్రీడలు

- సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో పోటీలు
- జిల్లా మహిళ శిశు సంక్షేమ, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ అధికారి సంధ్యారాణి



రంగారెడ్డి అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈనెల 25న ఎల్బీనగర్‌లోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా మహిళ శిశు సంక్షేమ, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ అధికారి సంధ్యారాణి తెలిపారు. ఆసక్తిగల దివ్యాంగులు ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. వివిధ విభాగాల్లో (10-17, 18-54 సంవత్సరాలు) ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆటల పోటీల్లో పాల్గొనే దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు తీసుకుని ఈనెల 25 ఉదయం 7 గంటలకు సరూర్ నగర్‌లోని ఇండోర్ స్టేడియానికి చేరుకుని పేరు నమోదు చేసు కోవాలన్నారు. జిల్లా స్థాయి ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. అంధులకు రన్నింగ్, షాట్ పుట్, చెస్, బధిరులకు రన్నింగ్, షాట్‌పుట్, కారమ్స్... శారీరక వైకల్యం కలిగిన వారికి షాట్‌పుట్, వీల్‌చైర్, ట్రైసైకిల్, క్యారమ్స్ బుద్ధి మాంద్యం ఉన్నవారికి రన్నింగ్, షాట్‌పుట్, క్యారమ్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల దివ్యాంగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



బాకారం జాగీర్ గ్రామ పరిధిలోని ఫామ్‌హౌస్‌లో వాటర్ ఫాల్‌లో ఎంజాయ్ చేస్తున్న పిల్లలు

నిత్యం ఉరుకులు పరుగుల జీవనం గడుపుతున్న పట్టణ వాసులు పల్లె వాతావరణాన్ని కోరుకుంటున్నారు. ప్రకృతి చెంతనే జీవించేందుకు ఇష్టపడుతున్నారు. దీంతో పల్లెల్లో ఫాంహౌస్ కల్చర్ విస్తరిస్తోంది. అనేక మంది పంటపొలాల వద్ద తమకు కావలసిన విధంగా ఫాంహౌస్‌లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారు. మరికొందరు పట్టణాల్లో ఉద్యోగాలు చేస్తూ అక్కడి నుంచే ప్రయాణం కొనసాగిస్తుండగా, ఇంకొంత మంది వారాంతపు సెలవుల్లో ఫాంహౌస్‌లకు వెళ్లి సేదతీరుతున్నారు.

Sunday Special

ఆనందాల హరివిల్లు
ప్రకృతి పొదరిల్లు

పల్లెలకు పాకిన ఫామ్‌హౌస్ సంస్కృతి



నగర శివారులోని ఓ ఫాంహౌస్



ఫాంహౌస్‌లో సేదతీరుతూ..

- ప్రకృతి ఒడిలో సేదదీరుతున్న నగర వాసులు
- పొలాల మధ్య సకల సౌకర్యాలతో నిర్మాణం
- వారాంతాల్లో బంధుమిత్రులతో కలిసి విడిది

రంగారెడ్డి అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, ముంబయి లాంటి మెట్రోపాలిటన్ నగరాల శివారులో బడా పారిశ్రామిక వేత్తలు, రాజకీయ నాయకులు విశాలమైన వ్యసాయ భూములను కొనుగోలు చేసి ఫామ్‌హౌస్‌లు నిర్మించుకునే వారు. వీలైనప్పుడల్లా అక్కడికి వెళ్లి ప్రకృతి అందించే స్వేచ్ఛాయుత వాయువులను పీల్చేవారు. రకరకాల మొక్కలను పెంచుకుని అవి అందించే మకరందాన్ని ఆస్వాదించేవారు. మొత్తంగా విలాసవంతమైన జీవితాన్ని అనుభవించే వారు. ఆ సంస్కృతి ఇప్పుడు పల్లెలను తాకింది. బడా వ్యాపారులు, బిల్డర్‌లు, ఉన్నతస్థాయి ఉద్యోగులు మారుమూల గ్రామాల్లో అర ఎకరం నుంచి ఐదెకరాల వరకు వ్యవసాయ భూమిని కొనుగోలు చేస్తున్నారు. ఆ భూమి చుట్టూ

మిగతా 7వ పేజీలో...

దరఖాస్తుల ఆహ్వానం


రంగారెడ్డి అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-2 పరీక్ష కోసం రెండు మాక్ టెస్టులను నిర్వహించనున్నట్లు జిల్లా మైనార్టీ అధికారి నవీన్ కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్‌లో హైదరాబాద్ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే ఈ గ్రూప్-2 మాక్ టెస్టుల రాయడానికి ఈనెల 29వ తేదీ వరకు మైనార్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మాక్ టెస్ట్ డిసెంబర్ 2, 3, 9, 10 తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉంటుందని ఆయన చెప్పారు. ఆసక్తిగల వారు దరఖాస్తులను హైదరాబాద్‌లోని జామియా నిజామియా కాంప్లెక్స్, గన్‌ఫౌండ్రి అబ్బుస్, తెలంగాణ మైనారిటీ స్టడీ సర్కిల్, 3వ అంతస్థులో సమర్పించాలని కోరారు.

ఖానాపూర్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్

మంజూరైనట్లు వెల్లడించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు , నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైనట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లులో శనివారం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో కల్వకుర్తికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కేటాయించినట్లు పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లోని సర్వేనంబర్ 256లో 25 ఎకరాలు ఈ స్కూల్ నిర్మాణానికి కేటాయించినట్లు తెలిపారు. త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. పేద పిల్లల విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సీఎంకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తెలవారినా.. తొలగవేం..



అసలే శీతాకాలం... ఆపై దట్టమైన పొగ మంచు... రహదారి వెంట ఇరువైపులా పొదరిల్లులా అల్లుకున్న భారీ వృక్షాలు.. అప్పుడే నింగి నుంచి నేలను తాకుతున్న భానుడి కిరణాలు... వీటన్నింటినీ ఒకేచోట చూస్తే ఆ సౌందర్య దృశ్యం వర్ణనాతీతం. ఈ అపురూపం మన్నెగూడ నుంచి వికారాబాద్ దారిలో ఆవిష్కృతమైంది. ఈ రోడ్డు వెంట ప్రయాణించే వాహనదారులు ఈ ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తూ ముందుకు సాగారు. ఇలాంటి కనువిందు చేసే దృశ్యాలు మళ్లీ మళ్లీ చూడలేమని కొందరు ఫొటోలు దిగారు.

– ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి

తుది దశకు సమగ్ర ఇంటింటి సర్వే

- రంగారెడ్డి జిల్లాలో 88.3 శాతం, వికారాబాద్ జిల్లాలో 89 శాతం పూర్తి
- రంగారెడ్డిలో డాటా ఎంట్రీ షురూ
- 7,700 కుటుంబాల వివరాలు కంప్యూటరీకరణ
- వికారాబాద్‌లో డాటా ఎంట్రీ కోసం 176 కంప్యూటర్లు సిద్ధం



బండవెల్కిచర్లలో సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్లు

రంగారెడ్డి అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చివరి దశకు చేరింది. శనివారం వరకు రంగారెడ్డి జిల్లాలో 88.3 శాతం సర్వే పూర్తి కాగా, వికారాబాద్ జిల్లాలో 89 శాతం పూర్తయ్యింది. రంగారెడ్డి జిల్లాలో గ్రామీణ ప్రాంతంలో 95 శాతం సర్వే పూర్తి చేయగా, మున్సిపాలిటీల్లో 83 శాతం పూర్తి చేశారు. వికారాబాద్ జిల్లాలో

మిగతా 7వ పేజీలో...

ఇష్టపడి చదివితే భవిష్యత్

బొంగులూరు మోడల్ స్కూల్, హాస్టల్‌ను సందర్శించిన కలెక్టర్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ చాలా కీలకమని, కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్ ఉంటుందని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. శనివారం రాత్రి ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధి బొంగులూరు మోడల్ స్కూల్, హాస్టల్‌ను ఆయన సందర్శించారు. అక్కడ ఇంటర్ చదువుతున్న విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. మరుగుదొడ్లు, వంటశాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల బోధన తీరుపై ఆరా తీశారు. ప్రభుత్వం మంచి వాతావరణంలో స్కూల్, హాస్టల్ వసతి కల్పిస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా, తాగు నీటికి ఇబ్బందిగా ఉందని, దోమ తెరలు ఇప్పించాలని బాలికలు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. సమస్యల పరిష్కారానికి ప్రణాళిక రూపొందించి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో కె.అనంత రెడ్డి, తహసీల్దారు సునీతారెడ్డి ఉన్నారు.

మత కల్లోలాల సృష్టికే ఆలయాలపై దాడులు

మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



శివలింగాన్ని ఎత్తుకెళ్లిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంపీ డీకే అరుణ

షాద్‌నగర్/షాద్‌నగర్‌రూరల్/చౌదరిగూడ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మత కల్లోలాలు సృష్టించేందుకే హిందూ దేవాలయాలపై దాడులు చేస్తున్నారని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. ఇటీవల ఫరూఖ్‌నగర్ మండలం జానంపేటలోని బసవేశ్వరాలయంలో శివలింగాన్ని ఎత్తుకెళ్లిన గుడిని ఆమె శనివారం సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో దేవాలయాలకు భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. దాడులను అరికట్టేందుకు ఆలయాల వద్ద రాష్ట్ర ప్రభుత్వం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శివలింగాన్ని ఎత్తుకెళ్లిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. అదేవిధంగా ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్దలో నూతనంగా నిర్మించిన హనుమాన్ దేవాలయాన్ని డీకే అరుణ సందర్శించారు. చౌదరిగూడ మండలం ఎంకిర్యాల సంజీవపురం వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన కార్తీక మాస సామూహిక వ్రతాల్లో పాల్గొన్నారు. శివలింగాన్ని ఎత్తుకెళ్లిన దుండగులను గుర్తించాలని కోరుతూ పట్టణ ప్రజలు షాద్‌నగర్ చౌరస్తాలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, చెంది మహేందర్‌రెడ్డి, బీజేపీ నేతలు మోహన్‌సింగ్, ప్రదీప్, నర్సింహులు, మురళీ పాల్గొన్నారు.

కన్హా శాంతివనానికి గుజరాత్ గవర్నర్



నందిగామ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నందిగామ మండలంలోని కన్హా శాంతివనాన్ని గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ శనివారం సందర్శించారు. శాంతివనంలో ఏర్పాటు చేసిన ట్రీ కన్సర్వేషన్ సెంటర్, టిష్యూ కల్చర్ లెబోరేటరీలను గురూజీ కమలేష్ డీ పటేల్‌తో కలిసి గవర్నర్ పరిశీలించారు. రామచంద్రమిషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను గవర్నర్ అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు గురూజీతో కలిసి దేవవ్రత్ ధ్యాన మందిరంలో 15నిమిషాలు ధ్యానం చేశారు. అనంతరం శాంతివనంలో ఎర్ర చందనం మొక్కను నాటారు. కార్యక్రమంలో రామచంద్రమిషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించిన డీసీపీ



మాట్లాడుతున్న డీసీపీ శ్రీనివాస్

చేవెళ్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల ఏసీపీ కార్యాలయాన్ని శనివారం రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్ పోలీస్‌స్టేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా కేసుల వివరాలను, ఎస్సీ, ఎస్టీ కేసులు, ఇతర పెండింగ్ కేసుల పురోగతిపై ఏసీపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బంది మరింత బాధ్యతయుతంగా పని చేయాలని డీసీపీ సూచించారు. సమావేశంలో ఏసీపీ బంటు కిషన్, డీఐ సీఐ రమేశ్‌నాయుడు, సీఐలు భూపాల్‌శ్రీధర్, కాంతరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు



వడ్లలో తేమను పరిశీలిస్తున్న ఏపీడీ నర్సింహ్మా

యాచారం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు తెచ్చే వడ్లలో తేమ 17శాతం ఉండేలా ఎండబోయాలని, మట్టిపెళ్లలు, తాలు లేకుండా ఎగబోయాలని డీఆర్‌డీవో ఏపీడీ నర్సింహ్మ రైతులను కోరారు. శనివారం చింతపట్ల, నందివనపర్తి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. పొలాల వద్ద ధాన్యం ఎండబోయకుంటే కొనుగోలు కేంద్రం ఎండపోయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు పంపుతున్నామన్నారు. అలాగే రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నామని చెప్పారు. కాగా డ్వాక్రా మహిళలకు విరివిగా రుణాలిచ్చేందుకు సీసీలు చొరవ తీసుకోవాలని ఏపీడీ సెర్ప్ సిబ్బందిని ఆదేశించారు. యాచారంలో సెర్ప్ సిబ్బందితో సమావేశమయ్యారు. రుణం కావాలని కోరిన ప్రతీ మహిళకు తక్షణమే రుణం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రుణాలు తీసుకున్న వారి నుంచి రికవరీ చేయాలన్నారు. ఆయనతో ఏపీఎం సుదర్శన్‌రెడ్డి, ఏపీవో లింగయ్య, సీసీలు ఉన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞాన్ని అందిపుచ్చుకుంటూ అభివృద్ధి వైపు సాగాలని సీవీఆర్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ కె.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదిభట్ల పరిధిలోని మంగల్పల్లి సీవీఆర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం, శేరిగూడ పాఠశాలల 9వ తరగతి విద్యార్థులు 62మంది పాల్గొన్నారు. వారికి ఎమ్మెస్ ఆఫీస్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, ఇంటర్నెట్‌ల శిక్షణ ఇస్తున్నారు. లక్ష్యాన్ని ఎంచుకొని ప్రణాళికాబద్ధంగా చదివితే ఎంతటి విజయాన్నైనా సాధించొచ్చని అన్నారు. విద్యార్థి దశలో సుఖాలను త్యాగం చేసి కష్టపడితేనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుతారని రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కష్టపడి ఉన్నత స్థాయికి వచ్చిన వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు కె.రామశాస్త్రి, లక్ష్మి, రత్నం, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ముగిసిన కాలుష్య పరీక్షలు



పోలీస్ స్టేషన్‌పై ఆర్డీఎస్ యంత్రాన్ని ఉంచుతున్న శాస్త్రవేత్తలు

తాండూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తాండూరులో గాలి కాలుష్యాన్ని గుర్తించేందుకు రెండోరోజు శనివారం కాలుష్య పరీక్షలు నిర్వహించారు. తాండూరులో గతంలోనూ ఈ పరీక్షలను నిర్వహించగా ఢిల్లీ కంటే ఎక్కువ కాలుష్యం ఉందని నిర్ధారించారు. తాండూరు ప్రాంతంలో విస్తరించిన సిమెంట్ కర్మాగారాలు, సుద్ద, పాలిషింగ్ యూనిట్లతో వాయు కాలుష్యం విపరీతంగా పెరిగింది. తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో 24గంటల పాటు రెండు యంత్రాలతో గాలి నాణ్యత పరీక్ష నిర్వహించారు. పీసీబీ శాస్త్రవేత్త జిమోత వాహన ఆధ్వర్యంలో బృందం గాలి కాలుష్యాన్ని కొలిచే ఆర్డీఎస్(రెస్పిరేబుల్ డస్ట్ శ్యాంపెయిర్) యంత్రాలను ఒకటి పోలీస్‌స్టేషన్ భవనంపై, మరొకటి పాత తాండూరులో అమర్చారు. యంత్రంలో ప్రత్యేక రసాయనాలను కలిపి పరీక్షలు చేశారు. 24గంటలు యంత్రాలను ఆన్‌లో ఉంచి పరీక్ష చేశారు. నివేదికను ఉన్నతాధికారులకిస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు. సాధారణంగా గాలిలో ఒక ఘనపు మీటరకు 100 మిల్లీ గ్రాముల ధూళి కణాలుంటాయి. అయితే 2016లో తాండూరులో 622మిల్లీ గ్రాముల ధూళి కణాలున్నట్టు తేలింది. ప్రస్తుతం ఈ పరిమాణం కూడా రెట్టింపయినట్లు గుర్తిస్తున్నారు.

ఎదులాబాద్‌లో ఒడిశా బృందం పర్యటన



ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్‌లో శనివారం ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యటించారు. ఎదులాబాద్‌లోని దివ్యాంగుల పునరావాస కేంద్రంలోని పిల్లలతో మాట్లాడారు. అనంతరం మహిళ సంఘాలు నిర్వహిస్తున్న, బేకరితో పాటు పేరటి కోళ్ల పెంపకాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో సాంబశివరావు, డీపీఎం సురేఖ, ప్రభాకర్, ఎంపీడీవో గీతారెడ్డి, ఎంపీవో రవినాయక్, ఏపీఎం తౌర్యానాయక్, మాధూరి పాల్గొన్నారు.

ఆనందాల హరివిల్లు ప్రకృతి పొదరిల్లు

(5వ పేజీ తరువాయి)

ఫెన్సింగ్, ప్రీకాస్ట్, ప్రహరీ ఏర్పాటు చేసుకొని రకరకాల పండ్ల, పూల మొక్కలను, ఆరోగ్యకరమైన చిరుధాన్యాలను సాగు చేస్తున్నారు. అంతేకాకుండా వ్యవసాయ క్షేత్రంలోని పచ్చని చెట్ల మధ్య ఆకర్షణీయంగా ఫామ్‌హౌస్‌లను నిర్మించుకుంటున్నారు. వారంలో రెండు రోజుల పాటు ప్రకృతి ఒడిలో కుటుంబ సభ్యులతో గడుపుతున్నారు. ముఖ్యంగా శని, ఆదివారాల్లో ఎంజాయ్ చేస్తున్నారు.

సకల సౌకర్యాలతో నిర్మాణం

వ్యవసాయ క్షేత్రాల్లో అన్ని హంగులతో సకల సౌకర్యాలు ఉండేలా ఫామ్‌హౌస్‌లు నిర్మించుకుంటున్నారు. సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేసుకుంటున్నారు. స్నేహితులు, బంధువులు ఎందరు వచ్చినా సౌకర్యవంతంగా ఉండేలా తీర్చిదిద్దుకుంటున్నారు. అవసరమైతే చిన్న చిన్న వేడుకలను జరుపుకునేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పిల్లల కోసం ప్రత్యేకంగా ఆట వస్తువులు, స్విమ్మింగ్ పూల్స్, ఆటల కోర్టులు, వాకింగ్ కోసం నిర్మాణాలు చేసుకుంటున్నారు.



వ్యవసాయ క్షేత్రంలో స్విమ్మింగ్ పూల్



గ్రామ పరిధిలోని ఫాంహౌస్‌లో చిన్నారుల ఆటలు

పెరుగుతున్న కల్చర్

నగరాల్లో ప్రతి రోజూ కాలుష్యంతో సమరం చేస్తూ జీవనం సాగిస్తున్న పట్టణవాసులు ఒక్క రోజైనా పల్లెల్లో గడపాలని భావిస్తున్నారు. మధ్యతరగతి వారు దేవాలయాలు, పర్యాటక ప్రదేశాలకు వెళ్లి కాటేజీల్లో బస చేస్తుంటే, ధనికులు సొంతంగా వ్యవసాయ భూములు కొనుగోలు చేసి ఫాంహౌస్‌లను నిర్మించుకుంటున్నారు. పట్టణాలకు సమీపంలో ఉండే గ్రామాల్లో ఈ ఫాంహౌస్‌లను ఏర్పాటు చేసుకుని ప్రకృతి సహజసిద్ధ వాతావరణంలో జీవిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని చిలుకూరు, నక్కలపల్లి, తోల్‌కట్ట, ఎనికెపల్లి, అజీజ్‌నగర్, కుద్బుద్దీన్‌గూడ, రెడ్డిపల్లి, కేతిరెడ్డిపల్లి, చిన్నమంగళారం, అమ్డాపూర్ వంటి ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల్లో ఎక్కువగా ఫాంహౌజ్‌లు నిర్మించుకున్నారు. ఇంకా చాలావరకు నిర్మాణాలు జరుగుతున్నాయి. చేవెళ్ల మండలం ముడిమ్యాల, దేవుని ఎర్రవల్లి, ఆలూరు, గొల్లపల్లి, ఈర్లపల్లి, రామన్నగూడ, న్యాలట, శంకర్‌పల్లి మండలం కొత్తపల్లి, వికారాబాద్ జిల్లా పూడూరు మండలం మన్నేగూడ ప్రాంతాల్లో ఎక్కువగా ఫామ్‌హౌస్‌లు ఉన్నాయి. కొంతమంది యువకులు వ్యవసాయాన్ని ఓ ఫ్యాషన్‌గా ఎంచుకుంటున్నారు. పొలం చెంతనే ఫార్మర్‌హౌజ్ ఏర్పాటు చేసుకొని విభిన్న రీతుల్లో వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారు. అక్కడే తమ కుటుంబంతో స్వచ్ఛమైన గాలి, నీరుతో పాటు ప్రశాంత వాతావరణంలో ఆరోగ్యకరమైన జీవనం గడుపుతున్నారు.



బాకారంలోని ఓ ఫామ్‌హౌస్‌లో వాటర్ ఫాల్స్‌లో ఎంజాయ్ చేస్తున్న కుటుంబ సభ్యులు

తాండూరుకు సమీకృత గురుకులం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కాంప్లెక్స్‌కు సేకరించిన స్థలం ఇదే

తాండూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాకు రెండో యంగ్ ఇండియా సమీకృత గురుకులం మంజూరైయింది. స్థలం ముందుగానే గుర్తించినా తాండూరు నియోజకవర్గానికి సంబంధించి గురుకులం పెండింగ్‌లో ఉంది. ఈ విషయంపై ఈ నెల 13న 'ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరయ్యేనా?' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లా అధికారులు ప్రభుత్వానికి వివరాలతో నివేదిక పంపారు. ప్రభుత్వం శనివారం తాండూరుకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. యాలాల మండలం దౌలాపూర్ వద్ద కొడంగల్ రోడ్డులో 25ఎకరాలను ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్‌కు కేటాయించారు. రూ.150కోట్లతో నిర్మిస్తారు. ఈ స్కూల్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన 2,060 మంది వరకు విద్యార్థులకు, బోధన, బోధనేతర సిబ్బందికి వసతులు కల్పిస్తారు. ప్రభుత్వ నిర్ణయంపై తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి స్పందిస్తూ.. వెనుకబడిన తాండూరు ప్రాంతానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నట్టు తెలిపారు. త్వరలోనే నిర్మాణ పనులను చేపట్టి వచ్చే విద్యా సంవత్సరంలోగా విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

పథకాల అమలుకు అధికారులు చొరవ తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి

కడ్తాల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సంక్షేమ, అభివృద్ధి పథకాలు సక్రమంగా అమలయ్యేలా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కె.నారాయణరెడ్డి అన్నారు. లక్ష్యాల పూర్తికి అలసత్వం చేయొద్దన్నారు. కడ్తాలలోని ఎంబీపీ గార్డెన్‌లో శనివారం ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. పథకాల అమలుపై శాఖల వారీగా సమీక్షించారు. అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. పేదలకు పథకాలందితేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని రవి, నారాయణరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేత నిర్ణయాలు, పథకాలు అమలుచేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీఆర్డీవో శ్రీలత, ఆర్డీవో అనంతరెడ్డి, డీఈవో సుశీందర్‌రావు, పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ కేశవరెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఎంపీడీవోలు మాధురి, సుజాత, శ్రీకాంత్, తహసీల్దార్లు ముంతాజ్, లలిత, నాగార్జున, ఎంఈవో లు సత్యనారాయణ, పాండు, చంప్లానాయక్, సర్దార్‌నాయక్, డైరెక్టర్లు నరేశ్‌నాయక్, రమేశ్, పాండురంగయ్య, కేఎన్నార్ సేవాదళం అధ్యక్షుడు బాబ, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్ పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సు కోసం కృషి చేస్తా



గీత సన్మాన కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే

కడ్తాల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):రైతుల శ్రేయస్సు కోసం తాను నిరంతరం కృషిచేస్తానని ఆమనగల్లు మార్కెట్ కమిటీ నూతన చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ అన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నియమితులైన గీతను శనివారం ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. కడ్తాలలో ఎంపీ ఎం.రవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డిలు గీతను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రైతుల శ్రేయస్సు కోసం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. రైతుకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేశారని, సన్న వడ్లకు క్వింటాలుకు 500బోనస్ ఇస్తున్నారని చెప్పారు. పలు సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతులకు త్వరలోనే మాఫీ చేస్తారన్నారు. ఎమ్మెల్యే సహకారంతో ఆమనగల్లు ఏఎంసీని ఆదర్శవంతంగా తీర్చిదిద్ది సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి జి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిక్యనాయక్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, తలకొండపల్లి ప్యాక్స్ చైర్మన్ కేశవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బిచ్యనాయక్, కిషన్‌రెడ్డి, జగన్, మానయ్య, నాయకులు వెంకటేశ్, లక్ష్మయ్య, వెంకన్న, సత్యం, సంపత్‌కుమార్, రమేశ్, మల్లేశ్, మహేశ్, శ్రీకాంత్, షాబుద్దీన్, మహేందర్, పవన్, ఎం.శ్రీను, మల్లేశ్‌గౌడ్, సుమన్, జహంగిర్‌బాబ, జహంగిర్ అలీ ఉన్నారు. అలాగే గీతనర్సింహ.. ఎమ్మెల్యే నారాయణరెడ్డిని హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

'కేబీఆర్' తరహాలో జాఫర్‌పల్లి అర్బన్ పార్కు



జాఫర్‌పల్లి అర్బన్ పార్క్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఉన్న కాసు బ్రహ్మానందరెడ్డి(కేబీఆర్) పార్క్ తరహాలో పరిగి శివారులో జాఫర్‌పల్లి అర్బన్ పార్క్‌ను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. జాఫర్‌పల్లిలో 120ఎకరాల్లో రూ.4కోట్లతో ఏర్పాటు చేయనున్న పార్క్‌కు శనివారం శంకుస్థాపనచేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ పార్క్ చుట్టూ మూడున్నర కిలోమీటర్ల మేర కాంపౌండ్ నిర్మిస్తామన్నారు. మధ్యలో రెండుచోట్ల సెంట్రల్ లైటింగ్ సిస్టం ఉంటుందని, పార్క్ అభివృద్ధికి రూ.4కోట్లు సరిపోకుంటే హెచ్‌ఎండీఏ ద్వారా మరిన్ని నిధులు తెస్తామన్నారు. సందర్శకులకు పార్కింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాకు తలమానికంగా పార్క్‌ను నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, పరిగి ఏఎంసీ చైర్మన్ బి.పరశరాంరెడ్డి, డీసీసీ ప్రధానకార్యదర్శి కె.హన్మంతు, ఫారెస్ట్ రేంజర్ జి.ప్రతిమ, తహసీల్దార్ ఆనంద్‌రావు, అధికారులు సాయికుమార్, భీమ్లానాయక్, కాంగ్రెస్ నాయకులు అంజనేయులు, తావుర్యా, చిన్ననర్సింహులు, బి.ఆనందం, ఎం.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లాల్‌కృష్ణప్రసాద్ ఎమ్మెల్యే, అధికారులను సన్మానించారు. లాల్‌కృష్ణ కోరిన రోడ్ల అభివృద్ధికి నిధులిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ఆవిష్కరణలు చేయాలి



మాట్లాడుతున్న చంద్రక్రాంత్

ఇబ్రహీంపట్నం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో నూతన ఆవిష్కరణలకు విద్యార్థులు కృషిచేయాలని యాక్సెంచర్ అసోసియేట్ డైరెక్టర్ చంద్రక్రాంత్ దన్నే అన్నారు. ఇబ్రహీంపట్నంలోని గురునానక్ యూనివర్సిటీలో మూడు రోజులు జరిగిన జాతీయ స్థాయి హ్యాకథాన్(హ్యాక్ ఎరీనా) 2024 వేడుకలు శనివారం ముగిశాయి. ముఖ్య అతిథి చంద్రకాంత్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీస్తాయన్నారు. నైపుణ్యాలను ప్రదర్శించుకునే అవకాశమొచ్చిందన్నారు. వర్సిటీ వీసీ గగన్‌దీప్‌సింగ్ కోహ్లి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించేందుకు సదుపాయాలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ విశ్వవిద్యాలయాలు, కాలేజీల, సాంకేతిక సంస్థల నుంచి 1,500 మంది విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, స్మార్ట్ సిటీ వంటి అంశాలపై అనుభవాలను పంచుకున్నారు.

రైతులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్ సులోచన, కమిటీ మెంబర్లు

షాద్‌నగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతు రాజ్యంలో తాము ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటామని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆశీస్సులతోనే తమకు పదవులు దక్కాయన్నారు. ప్రభుత్వ నమ్మకాన్ని వమ్ముచేయకుండా రైతు శ్రేయస్సుకు పాటుపడతామని చెప్పారు. వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని, లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసిందన్నారు. రాజకీయ జీవితాన్ని ప్రజలకు అంకితమిచ్చిన వీర్లపల్లి శంకర్ లాంటి ఎమ్మెల్యేను తానెప్పుడూ చూడలేదని, భవిష్యత్తులోనూ చూడబోనని కొనియాడారు.

27న ప్రమాణ స్వీకారం: మార్కెట్ కమిటీ పాలకవర్గం ఈ నెల 27న ప్రమాణ స్వీకారం చేయనుంది. కార్యక్రమానికి మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు హాజరువుతారని నాయకులు తెలిపారు. సమావేశంలో నూతన డైరెక్టర్లు బాలశౌరి, రవి, నర్సింహులు, సురేష్, వెంకటనర్సింహారెడ్డి, లాహోటి భరత్, కె.భరత్, మల్లయ్య, పి.వెంకట్‌రెడ్డి, సందీప్‌కుమార్, నవీన్‌కుమార్, నాయకులు రఘు, కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఇబ్రహీం తదితరుల పాల్గొన్నారు.

తుది దశకు ఇంటింటి సర్వే

(5వ పేజీ తరువాయి)

గ్రామీణ ప్రాంతాల్లో 89 శాతం, మునిసిపాలిటీల పరిధిలో 90 శాతం సర్వే పూర్తయ్యింది. మిగిలిన కుటుంబాలను త్వరగా పూర్తి చేసేలా ఆయా జిల్లాల కలెక్టర్లు చర్యలు తీసుకుంటున్నారు.

- రంగారెడ్డి జిల్లాలో 6,04,421 ఇళ్లను గుర్తించగా, శనివారం వరకు 5,376 మంది ఎన్యుమరేటర్లు 5,33,664 ఇళ్లలోని కుటుంబాల వివరాలను నమోదు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 2,57,063 కుటుంబాలకు సంబంధించి సర్వే వివరాలను సేకరించారు. అలాగే మున్సిపాలిటీల్లో 2,76,601 ఇళ్లలోని కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేశారు.
- వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 2,83,373 ఇళ్లు ఉన్నట్లు గుర్తించగా, ఈనెల 23వ తేదీ వరకు 2,52,535 ఇళ్లల్లోని కుటుంబాల వివరాలను ఎన్యూమరేటర్లు నమోదు చేసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 2,38,635 ఇళ్లలోని 2,12,192 కుటుంబాల వివరాలు నమోదు చేసుకోగా, మునిసిపాలిటీల పరిధిలో 44,738 ఇళ్లలోని 40,343 కుటుంబాల వివరాలు నమోదు చేశారు.

రంగారెడ్డి జిల్లాలో చకచకా డాటా ఎంట్రీ

రంగారెడ్డి జిల్లాలో డాటా ఎంట్రీ చకచకా కొనసాగుతోంది. సర్వే వివరాలను కంప్యూటర్‌లో ఎంట్రీ చేసేందుకు ఆపరేటర్లకు రెండు రోజులు శిక్షణ ఇచ్చారు. 2,500 మంది ఆపరేటర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. 24 గంటల పాటు డాటా ఎంట్రీ కొనసాగుతుంది. షిఫ్టుల వారీగా విధులు నిర్వర్తిస్తున్నారు. శనివారం ఒక్క రోజే జిల్లాలో 7,700 కుటుంబాల సర్వే వివరాలను కంప్యూటరీకరణ పూర్తి చేశారు.

ఎన్యుమరేటర్‌కు 120 నుంచి 180 ఇళ్లు

ఒక్కో ఎన్యుమరేటర్‌కు 120 నుంచి 180 వరకు ఇళ్లను కేటాయించారు. ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించేందుకు ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సేవలు తీసుకుంటున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాఠశాల విధులు పూర్తి చేసుకుని, ఆ తర్వాత ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహిస్తున్నారు.

వికారాబాద్‌లో డాటా ఎంట్రీకి ఏర్పాట్లు

వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా శనివారం వరకు 89శాతం సర్వే పూర్తి కాగా, అధికార యంత్రాంగం డాటా ఎంట్రీపై దృష్టి సారించింది. సర్వే ఫారాల్లోని వివరాలను కంప్యూటరీకరణ చేసేందుకు 240 మంది డాటాఎంట్రీ ఆపరేటర్లను నియామకం చేశారు. కాగా సర్వే సమాచారాన్ని కంప్యూటరీకరణ చేసేందుకు 176 కంప్యూటర్లను సిద్ధం చేశారు. ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకూ కంప్యూటరీకరణ చేయాల్సి ఉండగా, ఇంకా జిల్లాలో ఆ



ప్రక్రియ ఇంకా ప్రారంభించలేదు.

ధారూరులో 97 శాతం పూర్తి...

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో శనివారం వరకు 97 శాతం పూర్తి చేసుకుని ధారూరు మండలం జిల్లాలో మిగతా మండలాల కంటే ముందుండగా, మర్పల్లి 92 శాతం, కోట్‌పల్లి 95, బొంరాస్‌పేట్ 93, నవాబ్‌పేట్ 93, దుద్యాల్ 89, దోమ 90, పరిగి 89, బంట్వారం 91, చౌడాపూర్ 90, కొడంగల్ 86, తాండూరు 88, వికారాబాద్ 87, మోమిన్‌పేట్ 86, పూడూరు 84,

ఉమ్మడి జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే వివరాలు

	రంగారెడ్డి	వికారాబాద్
మొత్తం ఇళ్లు	6,04,421	2,83,373
సర్వే పూర్తయిన ఇళ్లు	5,33,664	2,52,535
పూర్తయిన సర్వే శాతం	88.3	89 శాతం
	రంగారెడ్డి	వికారాబాద్
మునిసిపాలిటీలు	16	04
సర్వే పూర్తయిన ఇళ్లు	2,76,601	40,343
సర్వే శాతం	83	90 శాతం
	రంగారెడ్డి	వికారాబాద్
మండలాలు	21	20
సర్వే పూర్తయిన ఇళ్లు	2,57,063	2,12,192
సర్వే శాతం	95	89 శాతం

పెద్దేముల్ 87, దౌల్తాబాద్ 90, కులకచర్ల 90, బషీరాబాద్ 88, యాలాల్ మండలంలో 79 శాతం సర్వే పూర్తయింది. పట్టణ ప్రాంతాల్లో పరిగి మునిసిపాలిటీ పరిధిలో 97 శాతం సర్వే పూర్తి కాగా, కొడంగల్ పరిధిలో 92, వికారాబాద్‌లో 94, తాండూరు మునిసిపాలిటీలో 85 శాతం సర్వే పూర్తయింది. ఇదిలా ఉంటే, సర్వే పూర్తి చేసిన వారి నుంచి శనివారం వరకు 1,54,479 ఫారాలు అధికారులకు అందాయి. వీటిలో గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన ఫారాలు 1,24,522 ఉండగా, పట్టణ ప్రాంతాలకు చెందిన 29,957 ఫారాలు ఉన్నాయి.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

యాచారం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని, డీఆర్డీవో ఏపీడీ నర్సింహ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను కోరారు. శనివారం చింతపట్ల, నందివనపర్తిలో కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. దళారీలకు విక్రయించి నష్టపోరాదని రైతులకు సూచించారు. నందివనపర్తి కేంద్రంలో రైతుల ఇబ్బందులు తెలుసుకున్నారు.

స్వయం ఉపాధికి విరివిగా రుణాలు

డ్వాక్రా పొదుపు సంఘాలకు స్వయం ఉపాధి కోసం విరివిగా రుణాలందించి ఆదుకునేందుకు సీసీలు చొరవ తీసుకోవాలని ఏపీడీ నర్సింహ సెర్ప్ సిబ్బందిని ఆదేశించారు. యాచారం మండల కేంద్రంలో సెర్ప్ సిబ్బందితో సమావేశమయ్యారు. రుణం కావాలని కోరిన ప్రతీ మహిళకు తక్షణమే అందించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంలో రుణాలు తీసుకున్న వారి నుంచి బాకీలు వసూలు చేయాలని ఆదేశించారు.

కుక్కలతో జనాల బెంబేలు

- వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న శునకాలు
- భయాందోళనలో ప్రజలు.. చర్యలు తీసుకోవాలని వేడుకోలు

కేశంపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కుక్కలు బాబోయ్.. కుక్కలు అంటూ జనాలు బెంబేలెత్తిపోతున్నారు. వీధుల్లో గుంపులుగా సంచరిస్తుండడంతో భయాందోళనకు గురవుతున్నారు. మండల కేంద్రంతో పాటు 29 గ్రామ పంచాయతీలలో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. చికెన్, మటన్ సెంటర్ల నిర్వాహకులు మాంసం వ్యర్థాలను రోడ్లపైనే పారవేస్తుండడంతో వాటిని తినడానికి షాపుల వద్ద కుక్కలు గుంపులుగా ఉంటున్నాయి. అంతేకాకుండా కోళ్లఫాంల యజమానులు చనిపోయిన కోళ్లను ఆరుబయట పారవేస్తున్నారు. వాటిని తినడానికి కుక్కలు ఫామ్‌ల వద్ద తిష్టవేసుకుని ఉంటున్నాయి. కుక్కలు గుంపులుగా ఉన్నప్పుడు ఒంటరి మహిళలు, చిన్నారులపై తరచూ దాడులకు తెగబడుతున్నాయి. రోడ్లపై నుంచి వెళ్లే వాహనదారులపై కూడా దాడులు చేస్తున్నాయి. దాంతో కుక్కలను చూస్తేనే జనాలు జంకుతున్నారు. ఉదయం, రాత్రి వేళలలో దాడులు అధికంగా ఉంటున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలం కేంద్రంలో కుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయని, ఉదయం దేవాలయాకు వెళ్తనప్పుడు వెంబడిస్తూ దాడికి ప్రయత్నిస్తున్నాయని వాపోతున్నారు. కాగా, అయ్యప్ప స్వాములు కుక్కల భయంతో ఎక్కడికెళ్లినా వారు కూడా గుంపుగా వెళ్తున్నామని చెబుతున్నారు. అంతేకాకుండా గొర్రెలు, మేకలపై దాడిచేసి చంపుతున్నాయని, గ్రామాలలో కుక్కల నివారణకు పంచాయతీ అధికారులు చొరవ తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కేశంపేట మండల కేంద్రంలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

కుక్కల భయానికి గుంపులుగా వెళ్తున్నాం



అయ్యప్ప స్వాములందరం కలిసి వేకువ జామున లేచి.. దేవాలయాలకు వెళ్తుంటాం. అయితే, ఒకరిద్దరు ఉంటే కుక్కలు వెంబడిస్తూ దాడులకు పాల్పడేందుకు యత్నిస్తున్నాయి. దాంతో భయానికి స్వాములందరూ కలిసి గుంపుగా వెళ్తున్నాం. అధికారులు కుక్కల బెడదపై చర్యలు తీసుకోవాలి.

- తలసాని రమణారెడ్డి, అయ్యప్ప స్వామి, కేశంపేట

క్రైం కార్నర్

బాలిక అదృశ్యం



ఐశ్వర్య

శంషాబాద్ రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యమైన సంఘటన శనివారం ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఎస్సై అర్షద్ కథనం మేరకు.. బీహార్‌కు చెందిన పశువాన్ వినోద్ బతుకు దెరువు కోసం కుటుంబ సభ్యులతో కలిసి కొన్నేళ్ల క్రితం శంషాబాద్‌కు వలస వచ్చాడు. పట్టణంలోని అక్బర్ కాలనీలో భార్యపిల్లలతో కలిసి అద్దెకు ఉంటున్నారు. ఈనెల 18న వినోద్ తండ్రికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో అతడి గుడిసెలో నిద్రిస్తున్నాడు. ఈక్రమంలో మధ్యాహ్నం 2గంటల సమయంలో నిద్రలేచి చూడగా తన గుడిసెలో వినోద్ కూతురు ఐశ్వర్య కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోయింది. ఈమేరకు అతడు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, వినోద్ నివాసం ఉండే గుడిసె పక్కన ఉన్న మరో గుడిసెలో ఉండే పింటుపై అనుమానం ఉందని తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలిక ఒంటిపై గ్రీన్ కలర్ టాప్, క్రీమ్ లెగ్గిన్, పింక్ కలర్ చున్నీ ఉందని, ఎత్తు 5 అంగుళాలు ఉంటుందని ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిస్తే ఆర్‌జీఐఏ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



ప్రసాద్((ఫైల్)

చౌదరిగూడ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలంం తుమ్మలపల్లిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పిట్ట ప్రసాద్(42) ఊళ్లో కరెంటు పోవడంతో గ్రామ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజ్ వేసేందుకు వెళ్లాడు. ఈక్రమంలో విద్యుత్ షాక్ తగలడంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. కాగా, పోలీసులకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ప్లాట్లు అమ్ముతామని నమ్మించి.. వ్యాపారి కిడ్నాప్

- రూ.కోటి కోసం డిమాండ్
- ఆస్తి కోసం కాగితాలపై సంతకాలు.. వేలిముద్రలు తీసుకున్న గుర్తుతెలియని వ్యక్తులు
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు.. ఆలస్యంగా వెలుగులోకి..

ఇబ్రహీంపట్నం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఓ వ్యాపారిని ప్లాట్లు విక్రయిస్తామని పిలిపించి కిడ్నాప్ చేసి డబ్బుల కోసం డిమాండ్ చేసిన ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధి బొంగులూరు వద్ద చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం మేరకు.. ఇబ్రహీంపట్నం టౌన్ బోయవాడ బస్తీలో నివాసముంటున్న రచ్చ నారాయణ వస్త్ర వ్యాపారంతో పాటు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. పది రోజుల క్రితం ఓ మహిళ వాయిస్‌తో ఆయనకు ఓ కాల్ వచ్చింది. కారు ఇన్సూరెన్స్‌కు సంబంధించి మాట్లాడి.. మీరు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తారు కదా అని అడిగి బొంగులూరు దగ్గర తమ ప్లాట్లు ఉన్నాయి.. కొంటారా? అని అడిగారు. దాంతో ఆయన ఈనెల 21న మధ్యాహ్నం 1.30గంటల ప్రాంతంలో తన కారులో డ్రైవర్ ముజీబ్‌ఖాన్‌తో కలిసి బొంగులూరు దగ్గర ఉన్న మెట్రోసిటీ వెంచర్‌కు వెళ్లాడు. ఇంతలో నలుగురు వ్యక్తులు వచ్చి నారాయణతో పాటు డ్రైవర్‌ను కారులో ఎక్కించుకున్నారు. ఇద్దరి ముఖాలకు నల్లటి మాస్కులు, చేతులకు హ్యాండ్‌కప్స్ వేసి 45 నిమిషాల తర్వాత ఓ తెలియని ప్రదేశానికి తీసుకెళ్లారు. అక్కడ ఓ గదిలో ఉంచారు. ఒకరు పోలీస్ యూనిఫాంతో ఉండగా మిగిలిన వ్యక్తులు సాధారణ దుస్తుల్లో ఉన్నారు. పోలీస్ యునిఫాంలో ఉన్న అతను నారాయణ తలకు గన్‌పెట్టి రూ.కోటి రూపాయలు ఇవ్వాలంటూ బెదిరించాడు. తన దగ్గర అంత డబ్బు లేదని సమాధానమీయడంతో పది కాగితాలపై ఆస్తికి సంబంధించి సంతకాలు, వేలిముద్రలు తీసుకున్నారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో కొంగర కలాన్ ఏరియాలోని ఓపెన్ వెంచర్‌లో దించి కారు, సెల్‌ఫోన్ అప్పగించారు. దాంతో భయపడిపోయిన నారాయణ నల్లగొండ జిల్లా చండూరులో ఉన్న అల్లుడికి ఫోన్‌చేసి కారులో చండూరు వెళ్లాడు. ఆదే సాయంత్రం ఆయనకు ధైర్యం చెప్పిన అల్లుడు.. ఇబ్రహీంపట్నం తీసుకొచ్చి కుటుంబ సభ్యులను అప్పగించారు. శనివారం ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసికొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వైభవంగా హనుమాన్ పల్లకీ సేవ



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చౌడమ్మగుట్ట ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం హనుమాన్ పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలుచేసి, స్వామి ఉత్సవ విగ్రహానికి పల్లకీ సేవను నిర్వహించారు. భజన పాటలు పాడుతూ, స్వామిని కీర్తిస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు. అంజనేయస్వామి ఆలయంలోని సత్రంలో అయ్యప్పలకు పౌల్ట్రీ పారిశ్రామికవేత్త గుడే సాంబశివ రావు వరలక్ష్మీ దంపతులు అన్నదానం చేశారు. రాష్ట్ర సహకార సంఘాల మాజీ చైర్మన్ రాజావరప్రసాద్, ఆలయ అభివృద్ధి కమిటీ కన్వీనర్ శ్రీశైలం గౌడ్, మాజీ ఎంపీపీ ప్రకాష్‌గౌడ్, వసంతరావు, సతీష్, పి.ప్రభాకర్‌రావు, జి. రమేష్, అశోక్‌గౌడ్, చెట్ల నర్సింహ, పోలే రాజేశ్వర్, ఎల్. రఘుగౌడ్, జి. రమేష్‌ముదిరాజ్, రఘునందన్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు

- జిల్లేడు చౌదరిగూడలో స్థలాలను పరిశీలించిన అధికారులు

చౌదరిగూడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రంలో నూతన ప్రభుత్వ భవనాల ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేపట్టారు. శనివారం పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్, తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈ వంశీకృష్ణ తదితర అధికారులు మండల కేంద్రంలో కార్యాలయాల ఏర్పాటుకు స్థలాలను గుర్తించారు. చౌదరిగూడ మండల కేంద్రంగా ఏర్పడిన నాటి నుంచి ప్రభుత్వ కార్యాలయాలన్నీ కూడా అద్దె భవనాల్లోని ఇరుకు గదుల్లోనే ఉన్నాయి. ఇటీవల ఎమ్మెల్యే శంకర్‌ను కలిసి ప్రభుత్వ కార్యాలయాల దుస్థితి గురించి పలువురు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లగా సొంత భవనాలు సమకూరుస్తామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. అధికారులు సొంత భవనాల కోసం స్థల పరిశీలన చేపట్టారు.

ఘనంగా సత్యసాయిబాబా జయంత్యుత్సవాలు



ఆమనగల్లు : సత్యసాయి జయంతి వేడుకల్లో సాయి భక్తులు

ఆమనగల్లు/కడ్తాల్/షాద్‌నగర్ అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలు ఆమనగల్లు పట్టణంలో శనివారం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ దొంతు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఉదయం ఓంకారం, సుప్రభాతం, మహానగర సంకీర్తనతో జయంతి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సత్యసాయి సామూహికవ్రతం చేపట్టారు. సత్యసాయి వ్రతాల్లో దంపతులు పాల్గొన్నారు. సాయంత్రం భజనలు, డోలారోహణం, హారతి, , కేక్ కటింగ్, స్వామి సందేశం నిర్వహించారు. సేవా సమితి కన్వీనర్ దొంతు శ్రీను, సభ్యులున్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో జయంతిని సాయి మందిరంలో జరుపుకున్నారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్, లియోక్లబ్, సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో మధుమేహ పరీక్ష శిబిరం నిర్వహించారు. పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి, కార్యదర్శి మహేశ్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. షాద్‌నగర్ పట్టణంలో సత్యసాయి సేవాసమితి షాద్‌నగర్ కన్వీనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతిని వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరైనారు. భజన, భక్తి పాటలు పాడుతూ నగర సంకీర్తన చేశారు. పరిగి రోడ్డు పక్కన సాయం ఆలయంలో షాద్‌నగర్‌కు చెందిన బెజుగం సుజనరమేష్ దంపతులు మహాన్యాసపూర్వక ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు. ఆర్డీసీ డీఎం ఉష, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- తహసీల్దార్లు.. మోడల్ స్కూళ్లు, గురుకులాల సందర్శన
- వసతి గృహాల తనిఖీ.. విద్యార్థుల సమస్యలు, వసతుల కల్పనపై ఆరా

శంషాబాద్ రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాల్మాకుల మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే బాలిక హాస్టల్‌ను శనివారం తహసీల్దార్ రవీందర్ దత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలించారు. ఇటీవల నారాయణపేట్ జిల్లా మాగనూర్ పాఠశాలలో 50మంది విద్యార్థులు అస్వస్థతకు గురి కావడంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల, మోడల్ స్కూల్స్‌లలో తనిఖీ నిర్వహించాలని ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈమేరకు పాల్మాకుల హాస్టల్‌ను తనిఖీలు చేశామని తహసీల్దార్ తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి రికార్డులను పరిశీలించారు. నాణ్యమైన భోజనం సరిగా పెట్టకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హాస్టల్ సిబ్బందిని హెచ్చరించారు. ఆర్ఐ కృష్ణ తదితరులు ఉన్నారు.

మహేశ్వరం : పరిసరాల పరిశుభ్రతతో పాటు విద్యార్థులకు అందజేస్తున్న భోజనం నాణ్యతగా ఉండాలని మండల తహసీల్దార్ సైదులు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హాస్టల్ పరిసరాలతో పాటు బియ్యం, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే మండలాభివృద్ధి అధికారి శైలజారెడ్డి మండలంలోని పలు స్కూళ్లను తనిఖీ చేశారు.

యాచారం : మండల కేంద్రంలోని బాలికల సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్‌ను, గున్‌గల్‌లోని మోడల్ స్కూల్ (బాలికలు) హాస్టల్‌ను తహసీల్దారు అయ్యప్ప, ఎంపీడీవో నరేందర్‌రెడ్డిలు తనిఖీ చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బాలికల ఇబ్బందులు తెలుసుకున్నారు. బోధన తీరు పరిశీలించారు. రగ్గులు, చెద్దర్లు, దుప్పట్లు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.



మహేశ్వరం : హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సైదులు



శంషాబాద్ రూరల్ : విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ రవీందర్ దత్



యాచారం : హాస్టల్‌లో భోజనం చేస్తున్న తహసీల్దార్ అయ్యప్ప

నిలిచిన పనులు పూర్తి చేయాలి



ఆసుపత్రి భవనం పనులను పరిశీలిస్తున్న జైపాల్ యాదవ్

ఆమనగల్లు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టి అసంపూర్తిగా నిలిచిపోయిన అన్ని అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు కేటాయించి పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ కోరారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమై ప్రజా విశ్వాసం కోల్పోయిందని ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో రూ.17.50 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణం పనులను శనివారం మాజీజడ్పీటీసీ అనురాధా పత్యానాయక్‌తో కలిసి జైపాల్ యాదవ్ పరిశీలించారు. పనులు నాణ్యతగా, త్వరితగతిన చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణానికి తాను ప్రత్యేక చొరవ తీసుకొని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నిధులు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. కల్వకుర్తి పట్టణానికి కూడా వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి రూ.27కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. మాజీ ఎంపీపీసీ కుమార్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పత్యానాయక్, గుత్తి బాలస్వామి, సయ్యద్ ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : భీంభరత్

షాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న కార్యకర్తలకు అండగా ఉండి అన్నివిధాలా ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. గుండెపోటుతో నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పీఏసీఎస్ వైస్‌చైర్మన్ మల్లేష్‌ను ఆయన పరామర్శించారు. కుటుంబసభ్యులకు చికిత్సనిమిత్తం రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలకు తాము అండగా ఉంటామన్నారు. పలువురు నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరిహారం అందించాలి

కందుకూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల క్రితం బేగంపేట, బాచుపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు వరద నీటిలో మృతి చెందారని, వారి కుటుంబాలకు పరిహారం అందించాలని ఎమ్మెల్యే సబితారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు శనివారం బాచుపల్లికి చెందిన మృతుడి తల్లి పి.అనిత ఆ గ్రామ మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్‌తో కలిసి మీర్‌పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి తనకు మంజూరైన డబ్బులు అకౌంట్‌లో పడలేదని మొరపెట్టుకున్నారు. దాంతో సబిత స్పందించి బేగంపేటకు చెందిన మధారం వెంకటేష్, బాచుపల్లి గ్రామానికి చెందిన పి.రాఘవేందర్‌లు నాలుగు సంవత్సరాలక్రితం అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిసర ప్రాంతంలో వరదనీటిలో కొట్టుకు పోయి మృతి చెందినట్లు గుర్తుచేశారు. ఒక్కో కుటుంబానికి రూ.4లక్షల చొప్పున మంజూరు చేశారని, వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమచేయకపోవడంతో రెండు కుటుంబాల సభ్యులు ఇబ్బందులకు గురౌతున్నట్లు తెలిపారు. డీఆర్వోకు ఫోన్‌చేసి వారి ఖాతాల్లో పరిహారం డబ్బులను వేయాలని తెలిపారు.

పాడిరైతులు అధికారుల సూచనలు పాటించాలి

మొయినాబాద్ రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు తమ పశువులకు ఎలాంటి రోగాలు దరిచేరకుండా పశువైద్యాధికారుల సూచనలు పాటించాలని అమ్డాపూర్ విభాగం పశువైద్యాధికారి దేవిరెడ్డి అన్నారు. బాకారం జాగీర్‌లో మండల పశువైద్యశాల ఆధ్వర్యంలో శనివారం పశువులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మొయినాబాద్ పశువైద్య అధికారి అహ్మద్, మొయినాబాద్ శివకుమార్, గోపాల మిత్రులు పాల్గొన్నారు.

26న సంయుక్త రైతు సంఘాల నిరసనలు

మంచాల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర పాలకుల కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న సంయుక్త రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టనున్నట్లు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల జంగయ్య తెలిపారు. రైతు సంఘాలు రూపొందించిన కరపత్రాలను శనివారం జాపాలలో ఆవిష్కరించారు. సీపీఎం నాయకులు శేఖర్‌రెడ్డి, జగన్, కాళ్ల జంగయ్య, కె.పాపిరెడ్డి, ఓరుగంటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో ఉద్యోగ నిర్వహణ స్ఫూర్తిదాయకం

- టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టుదల, ఆత్మవిశ్వాసమే పెట్టుబడిగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పేదింటి బిడ్డలు ఉద్యోగ ధర్మాన్ని అంకితభావంతో నిర్వర్తించి సమాజంలో మరికొందరికి స్ఫూర్తిదాయకంగా నిలువాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి కోరారు. ఆమనగల్లు పట్టణంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ పొంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతీ,యువకులకు శనివారం స్థానిక లక్ష్మీ గార్డెన్‌లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. రాఘవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కానిస్టేబుల్స్ ఇతర ఉద్యోగాలు సాధించిన వారిని పీసీసీ ఎన్‌ఆర్‌ఐ కోర్ కమిటీ సభ్యుడు పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి, ఫౌండేషన్ సభ్యులతో కలిసి సత్కరించి అభినందించారు. ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కులగణన ఆన్‌లైన్ ఎంట్రీ షురూ

కొత్తూర్/యాచారం/చౌదరిగూడ, నవంబర్ 23(ఆంధ్రజ్యోతి): కొత్తూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో డాక్టర్ అరుంధతి ఆధ్వర్యంలో కులగణన ఆన్‌లైన్ ఎంట్రీ కార్యక్రమం శనివారం ప్రారంభించారు. 15 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆన్‌లైన్ ఎంట్రీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా యాచారం మండలంలోని గ్రామాల్లో కుల గణన సర్వే ఇంకా కొనసాగుతోంది. 24 గ్రామాలకు గాను 15,808 కుటుంబాలు ఉండగా..శనివారం నాటికి 14,894 పూర్తి చేసినట్లు ఎంపీడీవో నరేందర్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా 408 సర్వే పత్రాలను ఆన్‌లైన ఎంట్రీ చేశారు. చౌదరిగూడ మండలంలో సమగ్ర సర్వే సాఫీగా కొనసాగుతోంది. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో మొత్తం 160మంది ఎన్యూమరేటర్లు, నలుగురు నోడల్ సిబ్బంది, 12మంది సూపర్‌వైజర్లు పాల్గొంటున్నారు. రెండు మండలాల్లో సర్వే 90శాతం పూర్తయ్యిందని ఎంపీడీవోలు ప్రవీణ్‌కుమార్, లక్ష్మిఅనురాధలు తెలిపారు.



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నరేశ్ నాయక్

ఎమ్మెల్యేను కలిసిన ఏఎంసీ డైరెక్టర్

కడ్తాల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన గొర్లకుంట తండాకు చెందిన నరేశ్ నాయక్ శనివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కడ్తాలలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తనకు డైరెక్టర్‌గా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు చెప్పారు. నాయకులు తదితరులున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపాలిటీలో ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధి కొంగరకలాన్ 5వ వార్డులో శనివారం రూ.20లక్షలతో సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కామండ్ల యాదగిరి, కౌన్సిపల్ వనం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మహా'లో విజయంపై బీజేపీ సంబురాలు



చేవెళ్ల పట్టణ కేంద్రంలో సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించడం హర్షణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహరెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం అన్నారు. ఈమేరకు జిల్లా యువ నాయకుడు మాల్గారి వైభవ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు భారీఎత్తున టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ఖాతాలో మరో రాష్ట్రం చేరిందన్నారు. 2028లో తెలంగాణలో బీజేపీ విజయం ఖాయమన్నారు. బీఎస్ఎన్ఎల్ కమిటీ సభ్యుడు మాణిక్యరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు కంజర్ల ప్రకాశ్, మండల ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, నాయకులు తదితరులున్నారు.

జార్ఖండ్‌లో విజయంపై కాంగ్రెస్ శ్రేణుల హర్షం



స్వీట్లు తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం, వయనాడ్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ భారీ మెజార్టీతో గెలుపొందడాన్ని హర్షిస్తూ ఆమనగల్లు పట్టణంలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున విజయోత్సవ సంబురాలు జరుపుకున్నారు. మండలాధ్యక్షుడు జగన్, పట్టణాధ్యక్షుడు మానయ్యల ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్‌చౌక్ వద్ద నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బాణసంచా పేల్చి మిఠాయిలు పంచారు. జార్ఖండ్‌లో కాంగ్రెస్ విజయం ప్రజా విజయమని నాయకులు అన్నారు. నాయకులు కృష్ణనాయక్, ఫరీద్, ఖాదర్, రాజశేఖర్, కాలె మల్లయ్య, మహేశ్, షాబోద్దీన్, తల్లోజు రామకృష్ణ, నాజర్, ఖాదర్ ఖాద్రీ, సురేశ్‌నాయక్, పులికంటి మైసయ్య, జంతుక యాదయ్య, బాల్‌రామ్, రఘురాములు, రవి, శ్రీను, సీత పెద్దయ్య, కుమార్, వెంకట్ రెడ్డి, మల్లేశ్, అలీం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

తలకొండపల్లి : మండల కేంద్రం ప్రకటించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని గట్టిప్పలపల్లి గ్రామ జేఏసీ నాయకులు అన్నారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 23వ రోజు చేరాయి. జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, నాయకులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు పట్టణంలో నిర్వహించారు. బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఇబ్రహీంపట్నం : విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకొని దానిని సాధించడానికి కఠోర శ్రమ చేయాల్సి ఉంటుందని విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కస్పా లక్ష్మీనారాయణ విద్యార్థులకు సూచించారు. ఆదిభట్ల మున్సిపాలిటి బొంగ్లూరు పరిధిలోని విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. కళాశాల డైరక్టర్ సెక్రెటరీ ఎ.శ్రీధర్ రెడ్డి, ప్రిన్సిపల్ డి. రమేష్, హెచ్‌వోడీ రామ కృష్ణ శర్మ, రమ్య శ్రీ, శ్రీకాంత్ కళాశాల వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

యాచారం : అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు, ఎస్సై తేజం రెడ్డిలు మహిళలకు సూచించారు. మేడిపల్లిలో మహిళలను కలిసి ఇబ్బందులు తెలుసుకున్నారు. పొలం పనులకు వెళ్లేక్రమంలో ఒంటరిగా వెళ్లరాదని, విలువైన నగలు ధరించరాదని సూచించారు. రాత్రివేళ అపరిచితులు తలుపు తీయాలని కోరితే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలని వారు సూచించారు.

ఇబ్రహీంపట్నం : విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకుని మూఢనమ్మకాలను వదిలేయాలని ఇబ్రహీంపట్నం మండల విద్యాధికారి హీర్యానాయక్, ఎస్సై రామకృష్ణలు అన్నారు. టీఎస్ యూటీఎఫ్, జనవిజ్ఞాన వేదికల ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చెకిముకి సైన్స్ సంబరాలు, మండల స్థాయి ప్రతిభ పరీక్ష నిర్వహించారు. 15 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులందజేశారు.

కడ్తాల్ : ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందిన మండల కేంద్రానికి చెందిన తుప్పరి రాజు, సిద్దిగారి మహేశ్‌ల కుటుంబాలను ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పరామర్శించారు. బాధిత కుటుంబాలకు రూ.10వేలు అందజేశారు. అదేవిధంగా కడ్తాల మండల కేంద్రంలో ముస్లీం నాయకుడు మహ్మద్ గౌస్ ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వాముల పడిపూజ , భిక్షలో జైపాల్ యాదవ్ పాల్గొన్నారు.

తలకొండపల్లి : ఖానాపూర్‌లో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా శక్తి వారోత్సవాలను నిర్వహించారు. సీసీదీప హాజరై మహిళాసంఘాల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కొత్తగా సంఘంలో చేరిన సభ్యులకు పాసు పుస్తకాలను అందజేశారు.

ఆమనగల్లు : పౌరహక్కుల సంఘం నేత టి.పురుషోత్తమ్ 23వ వర్ధంతిని శనివారం ప్రముఖ న్యాయవాది లక్ష్మణశర్మ కార్యాలయంలో నిర్వహించారు. పౌరహక్కుల సంఘం నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పురుషోత్తమ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. హైకోర్టు న్యాయవాది జె.లింగయ్య, పి.చంద్రశేఖర్, బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి సంజీవ్, దశరథ, వెంకటయ్య తదితరులున్నారు.

కేశంపేట : ఓటరు లిస్టులో తప్పులను సవరించుకునే అవకాశం తెలంగాణ ఎన్నికల సంఘం ఇచ్చిందని, ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకుని తప్పులను సరిచేసుకోవాలని తహసీల్దార్ మీర్ అజాంఅలీ సూచించారు. పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, వేములనర్వ, కేశంపేటలోని ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ కేంద్రాలను పరిశీలించారు.

శంకర్‌పల్లి : ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపీడీవో వెంకయ్యగౌడ్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి సురేష్‌బాబుతో కలిసి వైద్యసిబ్బందితో సమీక్షా నిర్వహించారు.

షాబాద్ : జడ్పీహెచ్ఎస్ తాళ్లపల్లిలో బయోసైన్స్ ఉపాధ్యాయురాలిగా దుర్గాభవాని, అంగ్లం టీచర్ గ్లోరిలు విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలనే ఉద్దేశ్యంతో దుర్గభవాని రూ.40వేలు, గ్లోరి రూ.20వేలు ఆర్థికసాయం అందించారు. ఇతర టీచర్లు సైతం తమ శక్తి మేర ఆర్థిక సహాయం చేస్తూ పాఠశాలలో వసతులు, పరికరాల కోసం పాటుపడుతున్నారు.